ప్రజాశక్తి
బుధవారం 4 సెప్టెంబర్ 2024 5 అనంతపురం





పోలా రామాంజనేయులు చిత్రపటం వద్ద నాయకుల నివాళి

రేపటి నుంచి 'అనంత'లో దులీప్‌ట్రోఫీ

ఇప్పటికే చేరుకున్న సి,డి టీమ్‌లు గ్రౌండ్‌లో నెట్ ప్రాక్టీస్



మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రికెటర్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బిసిసిఐ తలపెట్టిన దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఇప్పటికే సి, డి టీమ్‌లు అనంతపురానికి చేరుకున్నాయి. సోమవారం రాత్రికి ఈ రెండు టీమ్‌లు అనంతపురం నగరానికి చేరుకున్నాయి. ఒక ప్రముఖ హోటల్లో ఆటగాళ్లు బస చేశారు. మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు టీమ్‌ల ఆటగాళ్లు ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సులోని అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీసు చేశారు. గురువారం ఉదయం సి, డి టీమ్‌ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎ, బి టీమ్‌లకు సంబంధించి మ్యాచ్ బెంగళూరు నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో జరుగనుంది. ఆ మ్యాచ్ అనంతరం ఆ రెండు టీమ్‌లు అనంతపురం నగరానికి చేరుకోనున్నాయి.

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

అనంతపురం నగరంలో తొలిసారిగా జరుగుతున్న దులీప్‌ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను జిల్లా యంత్రాంగమూ పర్యవేక్షిస్తోంది. ఈ మేరకు దులీప్ ట్రోఫీ నిర్వాహక కమిటీ అధ్యక్షులు వినోద్‌కుమార్ మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖ ఆటగాళ్లు అంతా విచ్చేస్తున్న సమయంలో పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చే అవకాశాలు కనిపిస్తుండటంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అభిమానుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశమున్నందున ముందుగా పాసులను అందజేశారు. పాసులున్న వారిని మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. భద్రతా ఏర్పాట్లను జిల్లా పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తోంది. క్రికెటర్లకు భద్రతా ఏర్పాట్లతోపాటు జనసమూహం అధికంగా వచ్చే సమయంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై సమీక్ష నిర్వహించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ప్రముఖ క్రికెటర్లు అందరూ వస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆటగాళ్లు బస చేసిన హోటళ్లమొదలుకుని క్రికెట్ మైదానం వరకు అంతటా భద్రతా ఏర్పాట్లు చేశారు. అనుమతి ఉన్న వారికి తప్ప తక్కిన వారిని అనుమతించడం లేదు. మ్యాచ్ జరిగే ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సు చుట్టూ కూడా భద్రత కట్టుదిట్టం చేశారు. కాంప్లెక్సులోకి ప్రవేశించే ప్రధాన గేట్లను కూడా మూసివేశారు. నేటి నుంచి మరింత భద్రతను పెంచనున్నారు.

నగరంలో క్రికెట్ సందడి

ప్రముఖ ఆటగాళ్లందరూ విచ్చేస్తుండటంతో నగరంలో క్రికెట్ సందడి నెలకొంది. ప్రధానంగా యువత, క్రికెట్ అభిమానులు క్రికెటర్లను చూసేందుకు ఎగబడుతున్నారు. వారు బస చేసిన హోటళ్ల ముందు పెద్దఎత్తున గుమిగూడి ఉంటున్నారు. ఆ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కూడా ఏర్పడుతోంది. ప్రాక్టీసు సమయాల్లో స్టేడియం సమీపంలోనూ ఇదే రకంగా జనసందోహం నెలకొంటోంది.

'పోలా' పోరాటాలు స్ఫూర్తిదాయకం


సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పోలా రామాంజనేయులు పోరాటాలు స్ఫూర్తిదాయకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్ అన్నారు. పోలారామాంజనేయులు సంస్మరణ సభను స్థానిక ఎన్జీవో హోంలో మంగళవారం నిర్వహించారు. జంగాల పల్లి పెద్దన్న అధ్యక్షతన జరిగిన ఈ సభకు అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలా రామాంజనేయులు చేనేత కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటాల చేశారన్నారు. చేనేత కార్మికులకు గిట్టుబాటు ధర కల్పించాలని, చేనేత సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వంతో పోరాడారన్నారు. చేనేత సమస్యలపై నిరంతరం అధ్యయనం చేసి ఆ సమస్యల పరిష్కారంలో పోలా పాత్ర ఎంతో ఉందన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని అన్నారు. చేనేత సమస్యలపై పోరాటాల సమయంలో పోలా రామాంజనేయులు జైలుకు కూడా వెళ్లిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్. భాషా, సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ , ఆయుబ్ ఖాన్ , అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పోతక్క, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు దాము, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, పోలా రామాంజనేయులు కుమారులు శీనా, గంగాధర్, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, చౌడప్ప, హరి, రమణ, బాలాజీ, ఖాదర్‌భాషా, సత్తి, అన్నం సూరి, హమాలీ వర్కర్స్ నేల కోటప్ప, అంగన్వాడీవర్కర్స్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



వైసిసి సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

వైసిపి జిల్లా అధ్యక్షుల నియామకం

అనంతకు 'అనంత', సత్యసాయికి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్‌ను నియమిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సార్వత్రిక ఎన్నికల్ల ఘోర ఓటమి చెందిన విషయం తెలిసిందే. ఈసమయంలో జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎవరు మోస్తారన్న చర్చ గత కొంతకాలంగా నడుస్తోంది. ఇప్పటికే రెండు జిల్లాల పాత అధ్యక్షులు పదవుల నుంచి తప్పుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షులుగానున్న పైలా నరసింహయ్య పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరియున్నారు. అంతక ముందు నుంచే అధ్యక్ష పదవి మార్పులపై చర్చ నడుస్తోంది. రాబోయే ఐదేళ్లు పార్టీని సమయన్వంతో నడిచే వారు ఎవరన్న అన్వేషణ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఆ పార్టీ చర్చ నడుస్తోంది. ఎందుకంటే పార్టీ ఘోర ఓటమి తరువాతి తిరిగి నిలబెట్టుకునేందుకు రాబోయే ఐదేళ్లు అధికార టిడిపి పై పోరాటం సాగించాల్సి ఉంటుంది. అది చేయాలంటే జిల్ల సమస్యలపై అవగాహన ఉండటంతోపాటు, అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లే వారు అవసరమవుతారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అనంతపురం జిల్లాలో అనంత వెంకటరామిరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించినట్టు వైసిపిలో చర్చ నడుస్తోంది. ఇక సత్యసాయి జిల్లాలో మరో నాయకులు మాజీ మంత్రి శంకర నారాయణ ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో ఆయన అనంతపురం పార్లమెంటు నుంచి పోటీ చేసియున్నారు.ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లాలో ఉన్న వారిలో మహిళకు ప్రాధాన్యతనిస్తే బాగుంటుందన్న ఉద్దేశ్యంతో పెనుకొండ నుంచి ఈసారి బరిలో దిగిన మాజీ మంత్రి ఉషచరణ్ శ్రీకి ఆ బాధ్యతలిచ్చినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ పార్టీని ఏ రకంగా నడిపించగలరన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే ఇప్పటికే అక్కడున్న నేతలు పార్టీ కార్యాక్రమాల పట్ల పెద్దగా స్పందిస్తున్న దాఖలాల్లేవు. ఎన్నికల ఫలితాల నుంచి పెద్దగా కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. ఇటువంటి దగ్గరి అందరినీ మందుకు నడిపించడం ఉషచరణ్‌శ్రీ పెద్ద భారమే కానుందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

14, 15న అనంతలో జెవివి రాష్ట్ర వార్షిక మహాసభలు

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వార్షిక మహా సభలు, అనంతపురం నగరంలో సెప్టెంబర్ 14,15 తేదీల్లో నిర్వహించనున్నట్లు జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జెవివి రాష్ట్ర వార్షిక మహాసభలకు సంబందించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నగరంలోని మూడవ రోడ్డు జిఆర్ పంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ మహాసభలను ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్(ఎఐపిఎస్ఎన్) మాజీ అధ్యక్షులు, శాస్త్రవేత్త సవ్యసాచి చటర్జీ ప్రారంభించి 'శాస్త్రీయ దక్పథం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. ప్రారంభ సమావేశంలో, మాజీ ఎమ్మెల్సీ, శాసనమండలి మాజీ తాత్కాలిక చైర్మన్ వి.బాలసుబ్రమణ్యం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయా నంద్, జన విజ్ఞానవేదిక గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని ఉపన్యసిస్తారన్నారు. మొదటిరోజు మధ్యాహ్నం ప్రధాన కార్యదర్శి నివేదికను కుర్రా రామారావు, కోశాధికారి నివేదికను రాజశేఖర్ రాహుల్ ప్రవేశపెడతారన్నారు. విద్య వైద్యం పర్యావరణం శాస్త్ర ప్రచారం తదితర అంశాలపై, జెవివి కార్యాచరణ గురించిన చర్చ జరుగుతుందన్నారు. సాయంకాలం జరిగే సభలో, 'భారత రాజ్యాంగం–పౌర సమాజం పాత్ర' అనే అంశంపై, జెవివి నాయకులు, ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ వి బ్రహ్మారెడ్డి ఉపన్యసిస్తారని వివరించారు. రెండవ రోజు 15 తేదీ ఉదయం, 'రాష్ట్ర అభివృద్ధి–ప్రతిపాదనలు' అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ సదస్సులో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ కె. లక్ష్మణరావు ఉపన్యసిస్తారని ఈ సదస్సు తర్వాత ' శాస్త్ర ప్రచారంలో యువతరం, మహిళల పాత్ర'– అనే అంశంపై ప్రత్యేక సభ జరుగుతుందని చెప్పారు. మహాసభకు 26 జిల్లాల నుండి ప్రతినిధులు వస్తారని తెలిపారు.



ధర్నాలో పాల్గొన్న నాయకులు

రైతులపై బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం తగదు

ధర్నాలో రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

రైతులపై బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కల్లూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పట్ల బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పంట రుణాలు మంజూరులో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఒటిఎస్ చేసిన రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని, పాడి పరిశ్రమ, గొర్రెల పరిశ్రమకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్లాక్ చేసిన రైతుల అకౌంట్లను హోల్డ్ నుంచి తొలగించాలని, బ్యాంకుల్లో దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, మండల రైతు సంఘం కార్యదర్శి నల్లప్ప, శంకర్, ఓబులేసు, ఇస్మాయిల్, కొత్తపల్లి రాము, మల్లికార్జున, రమేజా, శివారెడ్డి, శిక్షావలి, సంగప్ప, జయరాముడు, వెంకటరాముడు, ఓబన్న,పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు

కలెక్టర్ వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులకు మెరుగైన భోజనం సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవిన్యూ భవనంలో జిల్లాలోని ఎంఇఒలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్స్, మిడ్ డే మిల్స్ ఏజెన్సీ, ఎస్ఎంసి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం (మిడ్ డే మీల్స్)ను విద్యార్థులకు సక్రమంగా అందించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 30వ తేదీన బుక్కరాయసముద్రం, రోటరీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని మధ్యాహ్నభోజన పథకాన్ని తాను తనిఖీ చేశానన్నారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఆహారపు అలవాట్లు ఉంటాయని దానికి అనుగుణంగా వారికి కావాల్సిన, ఇష్టపడే, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ కలసి చర్చించి ఇంకా మెరుగైన భోజనం అందించే దిశగా కృషి చేయాలన్నారు. అలాగే మిడ్ డే మీల్స్ ఏజెన్సీ వారి ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

13వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి-నార్పల

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు మండల పరిధిలోని బి.పప్పూరు పంప్‌హౌస్ వద్ద చేపట్టిన సమ్మె మంగళవారానికి 13వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పంప్‌హౌస్ వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆరునెలలుగా వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడవాలని, పిల్లలకు పాఠశాలల ఫీజులు ఎలా చెల్లించాలని వాపోయారు. అంతేగాకుండా 13 రోజులుగా సమ్మె చేస్తున్నా అటు బోర్డు అధికారులుగానీ, ఇటు ప్రభుత్వంకానీ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లానాయుడు, ఈశ్వరయ్య, వెంకటరమణ, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో పంటలకు వ్యాధులు ప్రబలకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం మండలంలోని దయ్యాలకుంటపల్లి, చెన్నంపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, వరి, చీనీ, మిరప, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త భార్గవి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా 60 నుంచి 75 రోజుల దశలో వేరుశనగ పైరు ఉన్నందున ఆకుమచ్చ తెగులు ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సాఫ్ 400 గ్రాములు ఎకరా పైరు, లేదా మాంకొజెబ్ 2 గ్రాములు కార్‌బెన్ డజిమ్ 1 గ్రాము లీటర్ నీటికి, 200 లీటర్లు స్ప్రే చేయాలన్నారు. అలాగే వరి నాటు సమయంలో కొనలు తుంచి నాటాలన్నారు. నారును క్లోరోపై రిఫస్ ద్రావణంలో ముంచి నాటాలన్నారు. 2 బ్యాగుల డిఎపి, 1బ్యాగు యూరియా, 1బ్యాగు పోటాష్ వాడాలన్నారు. కందిలో ఆకు ముడత నివారణకు వేప నూనె స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి శ్యాంసుందర్‌రెడ్డి, రైతు సేవాకేంద్ర ఇన్‌ఛార్జిలు నరేష్, నవ్య, దయ్యాలకుంటపల్లి మాజీ సర్పంచి పెద్దప్ప, కుళ్లాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజల నాయకుడు పరిటాల రవి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



రాప్తాడు ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మడకశిర, అనంత ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకుడు పరిటాల రవీంద్ర ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రామగిరి మండలం వెంకటాపురం వెళ్లారు. ముందుగా ఎమ్మెల్యేలు గమ్మనూరు జయరామ్, ఎంఎస్ రాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి భవానీ రవికుమార్‌తో కలసి పరిటాల రవి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరిటాల ఇంట్లో ఎమ్మెల్యే పరిటాల సునీతతో చర్చించారు. తర్వాత పరిటాల శ్రీరామ్, ఇతర ముఖ్య నాయకులతో కలిసి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ పరిటాల రవి అంటే తనకు ఎంతో అభిమానం అన్నారు. ఆయన మరణించి ఇన్నేళ్లు అయినా ప్రజలు ఇప్పటికీ అభిమానం చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు గంగారామ్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, రాయలసీమ బలిజ సంఘ యువజన అధ్యక్షుడు తొందపునాటి రమేష్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, టీడీపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

డీఎస్పీ ప్రతాప్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో వినాయక ఉత్సవ మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేయాలనుకునే వారు ఆన్‌లైన్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గతంలో వినాయక మంటపం ఏర్పాటు కోసం ప్రజలు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సి ఉండేదన్నారు. దీనికోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగాల్సి వచ్చేందన్నారు. ప్రజల సౌకర్యం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సింగిల్ విండో క్లియరెన్స్ విధానమును రూపొందించిందన్నారు. ప్రజలు సెల్..79950 95800 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే చాలు నిరభ్యంతర పత్రం కోసం అనుసరించరించాల్సిన విధివిధానాలు వస్తాయన్నారు. తర్వాత https://ganeshutsav.net అనే వెబ్‌సైట్‌లో గణేష్ మంటపం ఏర్పాటు చేయాల్సిన కమిటీ సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మంటపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయం లో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారనే వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరు ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్ని మాపక శాఖ, విద్యుత్ శాఖల యొక్క సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి మంటపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే అనుమతికి అవసరం అయిన రుసుం వివరాలు తెలియజేస్తారన్నారు. అనంతరం వారికి దగ్గరలో ఉన్న మీ–సేవ కేంద్రంలో తగిన రుసుమును చెల్లించి రసీదును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. వినాయక ఉత్సవ మండపాల కార్యనిర్వాహకులు ఈ సింగిల్ విండో విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆర్డీటీ స్టేడియం వద్ద వైద్య శిబిరాలు

డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 5వ తేదీ నుంచి నగర సమీపంలోని ఆర్డీటీ స్టేడియంలో ప్రారంభం కానున్న దిలీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు డిఎంహెచ్ఒ ఇబి.దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మ్యాచ్‌లను తిలకించేందుకు దేశవ్యాప్తంగా వేలాది మంది క్రికెట్ అభిమానులు ఆర్డీటీ స్టేడియానికి తరలివస్తారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని డాక్టర్లతో కూడిన బృందాలతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతోపాటు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సవేరా ఆసుపత్రి, కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రుల్లో ఒక్కో ఆసుపత్రిలో రెండు చొప్పున ఐసీయూ బెడ్లు, ఒక్కొక్క రూమును ప్రముఖుల అత్యవసర వైద్య చికిత్సల కోసం సిద్ధం చేసి ఉంచినట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వైద్యశిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు.



స్టేడియం నిర్వాహకులతో చర్చిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి.దేవి

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-గుత్తి

ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.శ్వేత తెలిపారు. మంగళవారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో వివిధ శాఖ అధికారులు, న్యాయవాదులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.రామశర్మ, ఉపాధ్యక్షులు పీడీ.రత్నం, సిఐ బి.వెంకటేశ్వర్లు, పెద్దవడుగూరు ఎస్ఐ వి.చిన్న రెడ్డప్ప, సెబ్ ఎస్ఐ టి.సునీల్, న్యాయవాదులు పి.ఫక్రుబాషా, టి.ధనుంజయ, ఎ.సూర్యనారాయణ, వీసీ.గంగాధర్‌కుమార్, ఎం.శ్రీధర్, ఆర్‌వి.చలపతి, జెడ్.సతీష్, జి.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

'గేట్స్'లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ప్రజాశక్తి-గుత్తి

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌డి కోఆర్డినేటర్ డాక్టర్ ఖయ్యూం మాట్లాడుతూ భారత ప్రభుత్వం దేశంలో అతిపెద్ద హ్యాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధించి ఒక అతి పెద్ద వేదిక అన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలు పునరుత్పాదక శక్తి, వ్యవసాయం, స్మార్ట్ వాహనాలు, క్లీన్ అండ్ గ్రీన్, స్పేస్ సాంకేతిక పరిజ్ఞానంకు సంబంధించి పరిష్కారం చూపాలని ప్రభుత్వం కోరిందన్నారు. కళాశాలలు విద్యార్థుల ఆలోచనలను ఈనెల 12వ తేదీలోపు సమర్పించాలన్నారు. అనంతరం గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల రీసెర్చ్, డెవలప్‌మెంట్ విభాగం విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వినాయక చవితి పండగను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్‌డిఒ రాణిసుస్మిత, డీఎస్పీ రవిబాబులు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామాల్లో మేళతాళాలు, మద్యం తాగడం, దీపాలు తదితర ఇబ్బందికర పరిణామాలకు అనుమతించేది లేదన్నారు. పండుగను సంతోషకర వాతావరణంలో జరుపుకుందామన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆర్‌డిఒ రాణిసుస్మిత, డీఎస్పీ రవిబాబు

నేత్రదానానికి ముందుకు రావాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నేత్రదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ తమ మరణాంతరం నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా తిరిగి టవర్‌క్లాక్ వరకూ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంధత్వ నివారణ కోసం పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీలు సదస్సులు నిర్వహించి నేత్రదానంపై అవగాహన కలిగించాలన్నారు. మరణానంతరం 6 గంటల లోపు నేత్రాలను సేకరించి కంటి చూపు లేని వారికి ఇద్దరకు కంటిచూపు కలిగించి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలోనే ఐ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నారని, ఇందుకు జిల్లాలోని ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. త్వరలోనే ఒక డెడికేటెడ్ ఫోన్ నెంబర్ ఐ డొనేషన్ కోసం ప్రారంభిస్తామన్నారు. అనంతరం స్థానిక పెన్షనర్ల భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఇబి.దేవి, ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ పాల్, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ సైదన్న, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మనోరంజన్‌రెడ్డి, ఆపిల్ ఐ కేర్ డాక్టర్ జగన్‌మోహన్, సీనియర్ కంటి వైద్య నిపుణులు అక్బర్, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు పెద్దన్నగౌడ్, భవాని, భానుకిరణ్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ సభ్యులు జనార్దనరెడ్డి, సుబ్రమణ్యం, ఆలంబన జనార్దన్, అప్ప సుధీర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.గిరిధర్, విష్ణుప్రియ, విజయలక్ష్మి, జైను బేగం, స్వచ్ఛంద సంస్థలు సభ్యులు, కెఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎస్ఎస్ జూనియర్ బాలిక కళాశాల, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

పర్యావరణాన్ని కాపాడుకుందాం

వజ్రకరూరు : చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని సర్పంచి బ్యాలారాణి రాజశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో సర్పంచి బ్యాలారాణి ఆధ్వర్యంలో ఇంద్రానగర్ స్కూల్, గవర్నమెంట్ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లే జీవకోటికి ప్రాణధారమన్నారు. చెట్లను పెంచడం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాలవ మారయ్య, మాజీ ఎంపిటిసి కుమారస్వామి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆసుపత్రి తనిఖీ

నార్పల : మండల కేంద్రంలోని తీర్థ ప్రయివేట్ ఆసుపత్రి ప్రభుత్వ వైద్యులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది తనిఖీలు చేపట్టారు. తీర్థ ఆసుపత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న ఫిర్యాదుతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్లు వైద్యులు తెలిపారు. అయితే ఎలాంటి లింగ నిర్ధారణ యంత్రం ఆసుపత్రి ఆవరణలో కనిపించలేదని వైద్యులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో సిహెచ్ఒ బాలాజీ, సూపర్‌వైజర్ అక్కులప్ప, ఫార్మాసిస్ట్ రాజేంద్ర, మునిరెడ్డి, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకోవాలి

శింగనమల : గణేష్ ఉత్సవాలను గ్రామాల్లో ప్రశాంతంగా చేసుకోవాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రతి ఒక్కరూ మత సామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నార్పల ఎస్ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ కౌలుట్లయ్య

సివిఆర్‌టిలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని సర్ సివి.రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కళాశాల ఛైర్మన్ బివి.బాస్కర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాల ఛైర్మన్ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన లక్ష్యాలను నిర్దేశించుకుని సన్మార్గంలో వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.హిందూధర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్య సాధనలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్న వారే అత్యున్నత స్థానాలను చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

అనంతపురం కలెక్టరేట్ : నగరంలో పలు అనారోగ్యాల కారణంగా ఆపరేషన్లు చేయించుకున్న ఇద్దరు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు. నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన ఆదిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి లివర్ సమస్యతో బాధపడుతుండగా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్నారు. దీంతో ఆయనకు సీఎంఆర్ఎఫ్ కింద 10లక్షలు మంజూరైంది. అలాగే నగరంలో రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్న సింగమశెట్టి వెంకటలక్ష్మి అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకోగా రూ.2,17,200 మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే నేరుగా బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, రాష్ట్ర నాయకుడు గంగారామ్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, మాజీ కార్పొరేటర్లు గుర్రం నాగభూషణ, పావురాల శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, రాయలసీమ బలిజ సంఘ యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, బీసీ సెల్ నాయకుడు జోగి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమాస్టర్ ఉద్యోగ విరమణ

నార్పల : మండలంలోని బొందలవాడ గ్రామ బ్రాంచి పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్న కొనంకి వెంకటరమణ మంగళవారం ఉద్యోగ విరమణ చెందారు. ఈ సందర్భంగా వెంకటరమణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర నాయకులు అలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ రిటైర్మెంట్ ఉద్యోగానికి మాత్రమేకానీ.. వయసుకు కాదు అన్నారు. కొనంకి వెంకటరమణ 38 ఏళ్లుగా పోస్ట్ మాస్టర్‌గా ఎలాంటి గొడవలు, వివాదాలు పని చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసులు, ఆనంద్‌బాబు, చెన్నకేశవులు, రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



జెఎల్ మురళిని సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

జెఎల్ మురళీకి సన్మానం

అనంతపురం : ఇటీవల డాక్టరేట్ పొందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అనంతపురం అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళీధర్‌ను గుత్తి టౌన్ బ్యాంకు పాలకవర్గం అబ్దుల్‌జిలాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు 12 మంది డైరెక్టర్లు, టిడిపి, జనసేన, బలిజ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

80శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ

పామిడి : మండల వ్యాప్తంగా ఖరీఫ్-2024 సీజన్‌లో ఇంతవరకూ పంటలు సాగు చేయని రైతుకు 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి లీలా వసుంధర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు ఉలువలు పూర్తి ధర 10 కిలోలు రూ.8,700 కాగా 80 శాతం సబ్సిడీ కింద రూ.6,960 పోనూ రైతుకు రూ.1,740 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా రెండు కిలోల కొర్రలకు సబ్సిడీ పోనూ రైతుకు రూ.1,748, జొన్న మూడు కిలోలు సబ్సిడీ పోగా రైతు రూ.140 చెల్సించాలన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు దగ్గరలోని రైతు సేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించి వారి భూమి పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌ను సమర్పించి ఆన్‌లైన్‌లో వేలిముద్ర వేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

మట్టి ప్రతిమలు ఏర్పాటు చేయాలి

గుత్తి : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మండపల్లో మట్టి వినాయక ప్రతిమలనే ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా కోరారు. 'మట్టి వినాయకుని పూజిద్దాం-పర్యావరణాన్ని రక్షిద్దాం' అనే నినాదంతో ముద్రించిన పోస్టర్లను మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలు, కలుషిత పదార్థాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల వాతావరణం కలుషితమవుతుందన్నారు. మట్టితో చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్టించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాధికారి ఇమామ్‌హుస్సేన్, ఆర్ఐ షేక్షావలి, సిబ్బంది రాజగోపాల్, చంద్రశేఖర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నార్పల : మండల వ్యాప్తంగా వినాయక ప్రతిమలు ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిమలను ఏర్పాటు చేసుకునేందుకు వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగించే స్థలాలను ఎంచుకోరాదన్నారు. ప్రతిమల వద్ద నిర్వాహకులే తగిన భద్రత చూసుకోవాలన్నారు. బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదన్నారు. వినాయక ప్రతిమల వద్దగానీ, నిమజ్జనం రోజుగానీ ఎలాంటి డీజేలు, డ్యాన్స్ చేయకుండా ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. నిమజ్జనం చీకటి పడకముందే పూర్తి చేసుకోవాలన్నారు. మైక్ ఉపయోగించే వారు పర్మిషన్ తప్పకుండా అనుమతి తీసుకోవాలన్నారు.

సబ్సిడీపై ఉలవలు పంపిణీ

ఆత్మకూరు : ఇప్పటి వరకూ పంటలు సాగు చేయని రైతుల సౌకర్యార్థం 90 శాతం సబ్సిడీతో ఉలవల విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారిణి సుచరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 కిలోల బ్యాగ్ పూర్తి ధర రూ.870 ఉండగా సబ్సిడీ రూ.696 పోగా రైతులు రూ.174 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరం భూమికి ఒక బ్యాగ్ చొప్పున ఐదెకరాల వరకూ ఐదు బ్యాగులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వానరానికి గాయాలు

నార్పల : మండల కేంద్రంలోని గూగూడు రోడ్డులో ఓ వానరం విద్యుత్ ఘాతంతో తీవ్రగాయాలతో రోడ్డు విలవిలలాడింది. స్పందించిన స్థానికులు గాయపడిన వానరాన్ని ప్రథమ చికిత్స చేయించేందుకు మండల కేంద్రంలోని వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వానరానికి చికిత్స చేస్తున్నారు. వానరాన్ని ఆసుపత్రికి తరలించిన స్థానికులు గోపాల్, అమీర్, బాలకృష్ణారెడ్డిని పలువురు అభినందించారు.

టిడిపి నాయకుడికి ఆర్థికసాయం

అనంతపురం కలెక్టరేట్ : ఐ టిడిపి నగర ప్రధాన కార్యదర్శి మంజునాథ్‌కు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ మంగళవారం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అంబారపు వీధిలో నివాసం ఉంటున్న మంజునాథ్ నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి ఆర్థికసాయం అందజేయడంతోపాటు కుటుంబాన్ని పరామర్శించారు.

ఘనంగా గౌరసంద్ర మారెమ్మ పూజోత్సవం

బెలుగుప్ప : మండల కేంద్రంలో వెలసిన గౌరసంద్ర మారెమ్మ దేవత ఆలయంలో అమ్మవారికి వార్షిక పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ధ్వజారోహణం, అభిషేకం, అష్టోత్తర శతనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత కండోల స్వీకారం (మెరివణిగా బుట్టను తెచ్చుట) పోతలింగేశ్వర స్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి ఒడిబియ్యం తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహా మంగళహారతి అనంతరం పురవీధుల గుండా అమ్మవారిని ఊరేగించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవీ ఉపాసకులు, భవాని దీక్షాపరులు, అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

వజ్రకరూరు : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహం ఆవరణలో ఈనెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్న ఎఐఎస్ఎఫ్ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చందు మాట్లాడుతూ దేశ బడ్జెట్‌లో విద్యారంగానికి 10, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే కళ్యాణదుర్గంలో నిర్వహించనున్న జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు హారుణ్ రషీద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల రైతులు జాగ్రత్తలు పాటించాలి

బెలుగుప్ప : పండ్ల తోటల రైతులు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పిడి ఎపిఎంఐపి రఘునాథ్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి చీనీ, మామిడి, దానిమ్మ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వతేదీలోగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే రైతులకు ఉద్యాన శాఖ అమలు అమలు చేస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలనిక కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఎం.కృష్ణతేజ, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసిన వన్‌టౌన్ సిఐ

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను 1వ పట్టణ నూతన సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సిఐ రెడ్డప్ప బదిలీపై ధర్మవరం టూటౌన్‌కు వెళ్లగా ఆ స్థానంలోకి రాజేంద్రనాథ్ యాదవ్ వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పరిధిలోని పలు అంశాల గురించి ఎమ్మెల్యే చర్చించారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడద్దని ఇందులో పార్టీలు ఎక్కడా చూడాల్సిన పని లేదన్నారు. ఎవరైనా పార్టీ పేరు కాని, తన పేరు చెప్పి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించవద్దన్నారు. సామాన్య ప్రజలకు న్యాయం జరగడమే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

ఆరోగ్య కేంద్రాల్లో 'ఆశా డే'

ప్రజాశక్తి-వజ్రకరూరు

రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఇందులో భాగంగా పోషణ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం అందించే విషయాన్ని వివరించారు. ఇకపోతే ఈనెల 17న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణుడు విశ్వనాథరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శింగనమల : గర్భిణులకు వందశాతం వ్యాధి నిరోధక టీకాలను అందించాలని పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తరిమెల పిహెచ్‌సిలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పొగాకు రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇకపోతే గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు తీసుకోవాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, సిహెచ్ఒ గంగాధర్, లెప్రసీ ఆఫీసర్ బాలఓబులు, పిహెచ్ఎన్ విజయలక్ష్మి, సిబ్బంది అశ్వర్థనారాయణ, నాగమ్మ, హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఈనెల 17న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ మేరీ, సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శింగనమలలో విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

రాప్తాడు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశాడే నిర్వహించారు. ఇందులో భాగంగా పలు కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోగులపై ఆశావర్కర్ల పని తీరు ఏవిధంగా ఉందని డాక్టర్ శివక్రుష్ణ, పిహెచ్ఒ శివప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ అరుణ, ఎంఎన్ఎం నరసింహా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రాప్తాడులో మాట్లాడుతున్న వైద్యాధికారులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అనంతపురం రూరల్ నారాయణపురంలోర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ ధనలక్ష్మి తెలిపారు. అనంతపురం రూరల్-5 సెక్టార్ పరిధిలోని సోమనాథ్ నగర్-1, 2వ అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులుఓ భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ జయశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు మహబూబ్ బి, సీతమ్మ, అంగన్వాడీ ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే మంచి పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ-1 సెంటర్ నుంచి కెజిబివి పాఠశాలతో కలిసి సిడిపిఒ ఉమాశంకరమ్మ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీదేవి మాట్లాడుతూ గర్భిణుల, బాలింతలు, కిషోర్ బాలికలు, తల్లులు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో లభించే ఆకుకూరలు, కాయగూరలు, పండ్లను తీసుకోవాలన్నారు. అనంతరం కిషోర్ బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త సుధారాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ సెంటర్లకు మునగ, నిమ్మ, ఆకుకూరలు కాయగూరల విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కౌసల్య, ధనలక్ష్మి, ఉమాదేవి, వర్కర్లు భారతి, ప్రమీల, ఆదిలక్ష్మి, రామాంజనమ్మ, ఆయాలు, గర్భిణులు, బాలికలు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో ఐసిడిఎస్ సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణులు, ఆరేళ్లలోపు చిన్నారులు బలవర్థకమైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు అనంతరం 104 సిబ్బందితో గర్భిణులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మధుమాలిని, అంగన్వాడీ ప్రాజెక్టు డైరెక్టర్ లావణ్య, అంగన్వాడీ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, తృణీత, పద్మావతి, లక్ష్మీనరసింహా, ఆశావర్కర్లు, గర్భిణులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక ఎద్దులపల్లి రోడ్డులో ఉన్న అంగన్వాడీ సెంటర్‌లో ఎసిడిపిఒ నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం పోషహాకార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిడిపిఒ రక్తహీనతపై తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, అంగన్వాడీ వర్కర్ రజని, ఆయా, తదితరులు పాల్గొన్నారు.